
శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త



## చేనేత కళాకారులను ప్రోత్సహించండి



**నెల్లూరు కలెక్టరేట్, ఆగస్టు 7 ప్రభాతవార్త** చేనేత వస్త్రాలను విరివిగా కొనుగోలు చేసి చేనేత కళాకారులను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ కేవీఎన్‌చక్రధర్‌బాబు పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం నాబార్డు సహకారంతో చేనేత-జౌళిశాఖ నెల్లూరులోని కస్తూర్బా బాలికల విద్యాలయం (రవీంద్రనాధ్ ఠాగూర్ భవన్)లో ఏర్పాటుచేసిన చేనేత వస్త్రప్రదర్శనను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ చేనేత దినోత్సవం పురస్కరించుకొని ఈనెల 7 నుండి 13వ తేదీవరకు కొనసాగేలా 30 చేనేత వస్త్రాల విక్రయస్టాళ్లతో చేనేత వస్త్ర ప్రదర్శన ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. అన్ని జిల్లాల నుండి పేరెన్నికగన్న కళాకారులు ఈ ప్రదర్శనలో పాల్గొంటున్నారన్న చక్రధర్‌బాబు ప్రాచీనకళలు మరుగునపడిపోకుండా...చేనేత కార్మికులకు అండగా..వారి శ్రమకు గుర్తింపు-గౌరవం ఇస్తూ ప్రజలందరూ చేనేత వస్త్రాలు కొనుగోలు చేయాలన్నారు. సుమారు 300 గంటలపాడు మగ్గంపై చేనేత కార్మికుడు శ్రమిస్తే ఒక చీర తయారవుతుందన్న ఆయన ఆ చీరకున్న మన్నిక పవర్‌హ్యాండ్లూమ్ మిషన్లపై మూడు నిమిషాల్లో తయారయ్యే చీరకు వుండదన్నారు. మన్నికతోపాటు శరీరానికి హాయినిచ్చే చేనేత వస్త్రాలను ధరించడం ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలన్న కలెక్టర్ జిల్లా అధికారులు ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి తప్పకుండా చేనేత వస్త్రాలు ధరించిరావాలన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న నెల్లూరు నగర మేయర్ పొట్లూరి స్రవంతి ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో వ్యవసాయరంగం తర్వాత చేనేత రంగానికి అత్యంత ప్రాధాన్యత వుందని ఆ రంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత దేశ ప్రజలందరిపైనా వుందన్నారు. కార్యక్రమానికి ముందుగా పోలీస్‌పరేడ్ గ్రౌండ్స్ నుండి చేనేత వస్త్రాల ప్రాధాన్యతను తెలియజేసేలా కస్తూర్బా కళాక్షేత్రం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాధ్, నెల్లూరు నగర కమీషనర్ హరిత, లీడ్‌బ్యాంక్ మేనేజర్ శ్రీకాంత్‌ప్రదీప్‌కుమార్, చేనేత-జౌళిశాఖ ఏడి ఆనంద్‌కుమార్. నాబార్డు డీజీఎం కేవీఎస్‌ప్రసాద్, డిఆర్ఎం మణిశేఖర్, డీడీఎం రవిసింగ్, ఆంధ్రప్రగతి గ్రామీణబ్యాంక్ రీజినల్ మేనేజర్ శైలేంద్రనాద్, జిల్లాపరిషత్ సీఈఓ వాణి, సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరక్టర్ రమాదేవి, చేనేత కార్పొరేషన్ డైరక్టర్ ఆదలక్ష్మి, పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షులు గుత్తికొండ శ్రీనివాసులు, జాతీయ చేనేత ఐక్యవేదిక జిల్లా పార్లమెంట్ కన్వీనర్ దోనేపూడి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**చేనేత కార్మికులకు ముద్రా రుణాలు** కెనరాబ్యాంక్, ఆంధ్రప్రగతి గ్రామీణబ్యాంక్‌ల సహకారంతో జిల్లాలోని ఏఎస్‌పేట, కావలిఎడవల్లి, సౌత్‌మోపూరు, నారాయణరెడ్డిపేట గ్రామాలకు చెందిన చేనేత కార్మికులకు ముద్రా పథకం ద్వారా రూ. కోటిరూపాయల మేర రుణాలను జిల్లా కలెక్టర్ కేవీఎన్‌చక్రధర్‌బాబు అందజేశారు. లీడ్‌బ్యాంక్ మేనేజర్ శ్రీకాంత్‌ప్రదీప్‌కుమార్‌మాట్లాడుతూ కెనరాబ్యాంక్ సహకారంతో ఏఎస్‌పేటలో 175 మంది చేనేత కార్మికులకు సంతృప్తస్థాయిలో ముద్రా రుణాలను అందజేయడం జరిగిందన్నారు.

## 17వ రోజూ కొనసాగిన ఎమ్మార్పీఎస్ దీక్షలు

**నెల్లూరు కలెక్టరేట్, ఆగస్టు 7 ప్రభాతవార్త** ఎస్సీ వర్గీకరణకు చట్టభద్రత కల్పించాలని, హైదరబాద్‌లో జరిగిన బిజెపి విజయసంకల్పసభలో నిరసన తెలిపిన ఎమ్మార్పీఎస్ నాయకులపై దాడులకు పాల్పడ్డవారిపై చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ల సాధనకై మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నెల్లూరుజిల్లాశాఖ కలెక్టరేట్ వద్ద చేపట్టిన దీక్షలు 17వ రోజైన ఆదివారం కూడా కొనసాగాయి. ఆదివారం నాటి దీక్షలలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ దీపోగు మస్తాన్‌మాదిగ, ఎంఎస్‌పీ జాతీయ నాయకులు గొల్లపల్లి శ్రీనివాసమాదిగ, రాష్ట్ర నాయకులు జి.వెంకటేశ్వర్లుమాదిగ, జిల్లా నాయకులు మంద పెంచలయ్యమాదిగ, కోలగట్ల రమేష్‌మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర స్ఫూర్తి పుణికిపుచ్చుకుందాం

**నెల్లూరు కలెక్టరేట్, ఆగస్టు 7 ప్రభాతవార్త** 75 వసంతాల భారత స్వాతంత్ర్య స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ పుణికిపుచ్చుకోవాలని నెల్లూరు నగర మేయర్ పొట్లూరి స్రవంతి పిలుపునిచ్చారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమాలలో భాగంగా ఆదివారం జిల్లా యంత్రాంగం నేతృత్వంలో నెల్లూరులోని సర్వోదయా కాలేజీ నుండి మహాత్మాగాంధీ విగ్రహం వరకు నిర్వహించిన భారీ ర్యాలీని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు పూర్తవుతున్న నేపధ్యంలో కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు ఆజాదీ కా అమృత్ పేరుతో 15 రోజులపాటు దేశభక్తిని ప్రబోధించేలా పలు




కార్యక్రమాలు నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. జిల్లావ్యాప్తంగా జరిగే ఈ కార్యక్రమాలలో ప్రజలు భాగస్వామ్యులు కావాలన్న స్రవంతి దేశ స్వాతంత్రం కోసం అసువులు భాసిన వారిని స్మరించుకోవాలన్నారు. అదేవిధంగా మూడు రోజులపాటు ప్రతి ఇంటా జాతీయ పతాకాలు ఎగురవేయాలన్నారు. కాగా సర్వోదయా కాలేజీ నుండి మహాత్మాగాంధీ విగ్రహం వరకు కొనసాగిన ఈ ర్యాలీలో జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాధ్, నెల్లూరు నగర కమీషనర్ హరిత, జిల్లాపరిషత్ సీఈఓ వాణి, జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి కనకదుర్గాభవాని, సెట్నెల్ సీఈఓ పుల్లయ్య అధికసంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# జిల్లా బ్యాడ్మింటన్ క్రీడాకారులకు మరిన్ని ప్రోత్సాహకాలు

**నెల్లూరు ఆగస్టు 7 ప్రభాతవార్త-స్పోర్ట్స్** పతకాలు సాధించే బ్యాడ్మింటన్ క్రీడాకారులను తమ అసోసియోషన్ తరపున మరిన్ని ప్రోత్సాహకాలను అందించనున్నామని ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియోషన్ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ అన్నారు. ఆదివారం జిల్లా స్థాయిలో జరిగిన బ్యాడి మ్రింటన్ పోటీలలో గెలుపొందిన నెల్లూరు జిల్లా జట్టు క్రీడాకారులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈసందర్భంగా సుధా కార్యాలయంలోని ఆయన ఛాంబరలో జరిగిన అభినందన కార్యక్రమంలో ముక్కాల మాట్లాడుతూ



జిల్లా స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో రాణించి జిల్లాకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. పతకాలు సాధించిన క్రీడాకారులకు తమ అసోసియోషన్ ద్వారా మరిన్ని ప్రోత్సాహకాలను అందిస్తామని చెప్పారు. ఈకార్యక్రమంలో జిల్లా బ్యాడ్మింటన్ అసోసియోషన్ ప్రదాన కార్యదర్శి నిమ్మల వీర వెంకటేశ్వర్లు, సభ్యులు మద్దిపాటి ప్రసాద్‌రావు, గంగపట్నం రామ్మోహన్, వరప్రసాద్, జాలీ బ్యాడ్మింటన్ క్లబ్ అధ్యక్షుడు కోట సూర్యనారాయణ ప్రసన్న రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అల్లూరు మండలం ఇస్కపాళెంలో దారుణం

**అల్లూరు, ఆగస్టు 7 ప్రభాతవార్త** అల్లూరు మండల పరిధిలోని ఇస్కపాళెం గ్రామంలో ఆదివారం ఉదయం భార్యా, బిడ్డని హతమార్చి భర్త ఆత్మహత్య చేసుకున్న దారుణమైన సంఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు ఇలావున్నాయి. ఆవుల మురళి, ఆవుల స్వాతికి ఒకటిన్నర సంవత్సరం వివాహమైంది. వారికి ఐదు నెలల చంటి బిడ్డ వున్నాడు. అయితే స్వాతిపై భర్తకు అనుమానం ఏర్పడింది. ఈ



అనుమానంతో స్వాతిని, ఐదు నెలల చంటి బిడ్డను భర్త మురళి, ఆయన తల్లిదండ్రులు, సోదరి కలిసి హతమార్చారు. భర్త మురళి కూడా ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు తెలిపారు. ఈ సంఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ దారుణ సంఘటనను చూసిన గ్రామస్తులు బోరున విలపించారు. మృతురాలు తండ్రి తిరుపతి ఫిర్యాదు మేరకు భర్త ఆవుల మురళి, ఆయన తల్లిదండ్రులు, సోదరిపై కేసు నమోదు చేశామని తెలిపారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టమ్ నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోస్ట్‌మార్టమ్ నివేదిక వస్తే వివరాలు తెలుస్తాయని పోలీసులు తెలిపారు.

## లఘు చిత్రాలను ఆదరించాలి



**నెల్లూరుటౌన్, ఆగస్టు 6 ప్రభాతవార్త** లఘు చిత్రాలను ప్రజలు ఆదరించాలని ప్రతి ఒక్కరిలో ఎదో ఒక ప్రతిభ ఉంటుందని డివైన్ స్టార్ సుమన్ అభిప్రాయపడ్డారు. నెల్లూరు నగరానికి చెందిన ఉమెన్ అనే డాక్యుమెంటరీ ఫిలింను ప్రారంభించారు. దర్శకుడు కెఎస్. చంటి, నిఖిల్‌రాజు రూపొందించిన డాక్యుమెంటరీ డైరెక్టర్ షేక్. అబ్దుల్ రషీద్ పర్యవేక్షనలో జరుగుతోంది. ఈచిత్రంలో హిరో సుమన్ సుఫయా పర్వేజ్ నటించినట్లు యూనిట్ తెలిపింది. నందనప్రియా, ప్యారి, రహీల, కుసుమ తదితరులు ఈకార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసంధర్బంగా సుమన్ మాట్లాడుతూ చిన్నచిత్రాలను ప్రేక్షకులు ఆదరిస్తే కొత్త దర్శకులు, నటీనటులకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈకార్యక్రమంలో సయ్యద్ షా, షరిఫుద్దిన్, మదారి సాహెబ్, ఎస్‌కె. కుమార్తైజ్, ఎస్‌కె. రషీద్ తదితరులు పాల్గొన్నారు.

## మైపాడు శివాలయం మహాకుంబాభిషేకంలో ఎమ్మెల్యే ప్రసన్న



**ఇందుకూరుపేట ఆగస్టు 7 ప్రభాతవార్త** ఇందుకూరుపేట మండలం మైపాడు గ్రామంలోని శ్రీ అన్నపూర్ణాదేవి సమేత శ్రీప్రసన్న విశ్వేశ్వరస్వామి ఆలయం దాతల, ధర్మకర్తల మండలి ఆద్వర్యంలో అబివృద్ధి పథంలో భక్తుల అభిమానం చోరగొంటున్నట్లు కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం శివాలయంలో నిర్వహించిన మహాకుంభాభిషేకం ముగింపు సందర్బంగా స్దానిక యువనాయకులు దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి ఆద్వర్యంలో నిర్వహించిన ప్రముఖుల సన్మాన కార ్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్బంగా దేవస్దానం కార్యనిర్వహణలో కృషి చేసిన వారిని ఘనంగా సన్మానించారు. ఈ సభలో మాట్లాడుతు దేవస్దానం నిధులు 10 లక్షలు దాతల సహకారంతో దేవస్దానంలో పురోగతిలో ఉన్నట్లు ఆయన తెలిపారు. దర్మకర్తల మండలి ప్రమాణస్వీకారం తరువాత భూముల ఆదాయం 13 లక్షల నుండి 25 లక్షల వరకు ఆదాయం పెరిగినట్లు తెలిపారు. 8 లక్షలతోఫ్లోరింగ్, 13 లక్షలతో గర్భగుడి నిర్మాణం, దాత ఇనమాల శ్రీదర్‌రెడ్డి ద్వారా 2 లక్షలకు పైగా ఆలయం అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు తెలిపారు. ఈ మహాకుంభాభిషేకంలో ప్రధాన పాత్ర పోషించిన దువ్వూరు కళ్యాణ్‌రెడ్డిని ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. ఈకార్యక్రమంలో విజయాడైరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, డిసిఎంఎస్ చైర్మన్ వీరి చలపతి, బుచ్చిరెడ్డిపాలెం నగరపాలక చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, డిఎల్‌డిఎ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, మండల వైసిపి కన్వీనర్ మావూలూరు శ్రీనివాసులురెడ్డి, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ , కొడవలూరు, విడవలూరు జడ్‌పిటిసిలు ఆలయ చైర్మన్ కనుపూరు సురేంద్ర, కార్యనిర్వాహణాధికారి తాతా నాగేశ్వరరావు, మహాకుంభాభిషేకం నిర్వాహకులు కుర్తాలం పీఠాధిపతి మాచవోలు రమేష్‌శర్మ, ఆలయ పూజారి బండారు ప్రకాష్‌శర్మ, ఎంపిడిఒ రఫీఖాన్, మండల అధికారులు , స్దానిక నాయకులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే గారూ! ఇందిరమ్మ కాలనీలో కనీస వసతులు కల్పించండి

**కావలి, ఆగస్టు 7 ప్రభాతవార్త** కావలి మున్సిపాల్టీ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో కనీస వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కాలనీ వాసులు గగ్గోలు పెట్టారు. ఆదివారం కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని కాలనీ వాసులు కలిసి వినతి పత్రం అందజేశారు. సమస్యల్ని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ కాలనీవాసులు కరవది భాస్కర్, విజయలక్ష్మి, హసీనా, ఫరీదా, హస్నా నా, తోట రాధిక, యశోదమ్మ, ప్రసాద్, మల్లి, వనజ, సుమిత్ర, ఆశీర్వాదంలు మాట్లాడారు. రోడ్లు, కరెంటు స్తంభాలు, డ్రైనేజి వంటి కనీస వసతులు కూడా లేవన్నారు. చిన్నపాటి వర్షానికే రోడ్లు చెరువుల్లా తలపిస్తున్నాయన్నారు. ప్రజల రాకపోకలకు ఇబ్బందికరంగా మారిందన్నారు. నిత్యం కరెంటు సమస్యలతో జనం తల్లడిల్లుతున్నారన్నారు. ముసునూరు ఇందిరమ్మ కాలనీకి వెళ్లేందుకు దారి కూడా లేదన్నారు. ముసునూరు రోడ్డు నుండి రైల్వే గేటు వరకు దారిని ఏర్పాటు చేయాలన్నారు. గుంతల్ని మట్టితో పూడ్చాలన్నారు. పందుల నివాసంగా కాలనీ ప్రాంతం మారిందన్నారు. ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు ఇందిరమ్మ కాలనీ పట్ల చిన్నచూపు చూస్తున్నారని వాపోయారు. ప్రజల పట్ల ఇంత నిర్లక్ష్యం తగదన్నారు. త్వరలోనే ఇందిరమ్మ కాలనీని సందర్శించి సమస్యల్ని పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

## విప్లవ కెరటం అమరులు గడ్డం కోటారెడ్డి



**కావలి, ఆగస్టు 7 ప్రభాతవార్త** శ్రీకాకుళ సాయుధ పోరాటంలో అమరుడైన గడ్డం కోటారెడ్డి విప్లవ కెరటమని విరసం రాష్ట్ర నేత జి.కళ్యాణ్‌రావు తెలిపారు. కావలి ప్రాంతానికి చెందిన గడ్డం కోటారెడ్డి విప్లవకారులకు, విప్లవాభిమానులకు స్ఫూర్తి అని ఆయన తెలిపారు. కావలి పట్టణ షాదీమంజిల్‌లో గడ్డం కోటారెడ్డి 48వ వర్ధంతి సందర్భంగా ఆదివారం స్మారకోపన్యాసం, అమరవీరుల సంస్మరణ సభ జరిగింది. గడ్డం కోటారెడ్డి పుస్తకావిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రశ్నించడం నేరమైన ప్రజాస్వామ్యంపై విరసం నేత కళ్యాణ్‌రావు మాట్లాడిన తీరు అందర్ని ఆలోచింపజేసింది. నక్సల్బరీ పంథాయే ఈ దేశానికి స్వేచ్ఛా, స్వాతంత్రత్యాలనిస్తుందని నమ్మిన వ్యక్తి గడ్డం కోటారెడ్డి అన్నారు. ప్రజలే చరిత్ర నిర్మాతలు అని, అంతిమ విజయం ప్రజలదేనని విప్లవోద్యమం ముందుకు సాగుతుందే కాని ఓడిపోదని, రాజీపడదని భావించిన వ్యక్తి కోటారెడ్డి అన్నారు. రైతు కుటుంబంలో జన్మించి ఉపాధ్యాయ వృత్తిని చేపట్టి, ఆ వృత్తిని, కుటుంబాన్ని వదిలి నక్సల్బరీ శ్రీకాకుళం పోరాటాలలో ఆయన భాగస్వామి అయ్యారన్నారు. విప్లవోద్యమంలో ఆయన అమరులయ్యారన్నారు. విప్లవకారులను స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా వుందన్నారు. సీనియర్ న్యాయవాదులు ఒ.అబ్బయ్యరెడ్డి, తన్నీరు కోటయ్య, విరసం నేత వి.చెంచయ్య, స్మారక కమిటీ కన్వీనర్ గడ్డం రామకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు. విప్లవ గీతాలతో, సాంస్కృతిక కార్యక్రమాలతో హోరెత్తింది.






నెల్లూరులోని బారాషహీద్ దర్గా ఆవరణలోని స్వర్ణాలచెరువులో రొట్టెలపండగ మరో రెండు రోజుల్లో ప్రారంభం కానుంది. కానీ అపుడే సందడి మొదలైంది. ఆదివారం నుంచే భక్తులు రాక ప్రారంభమైంది. చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ తదితర సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి రొట్టెలు మార్చుకుంటున్నారు. కొంతమంది అయితే ముందుగా వచ్చి రొట్టెల పండగ ప్రారంభం అయ్యేవరకు అక్కడే ఉంటున్నారు. ఫోటోలు: నందా మాల్యాద్రిన





# శోభాయమానంగా బారాషహీద్ దర్గా





**నెల్లూరుటౌన్, ఆగస్టు 6 ప్రభాతవార్త** మతసామరస్యానికి ప్రతీకగా నిలిచి ఉన్న శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరుజిల్లా కేంద్రమైన నెల్లూరు నగరంలోని బారాషహీద్ దర్గా శోభాయమానంగా ముస్తాభవుతోంది. రాష్ట్ర పండుగగ కీర్తికెక్కిన రొట్టెల పండుగ దేశ, విదేశాల్లోనూ పేరుగాంచి వుంది. భక్తులు తమ కోరికలు నెరవేర్చుకునేందుకు కొందరు రొట్టెలు స్వీకరించడం ఆనవాయితీ. కోరికలు తీరిన తరువాత తిరిగి భక్తులు ఆ రొట్టెలను పట్టుకోవడం, రొట్టెను ఒకరికొకరు మార్చుకోవడం ఈపండుగ యొక్క ప్రాముఖ్యత. దర్గా ప్రాంగణానికి ఆవలి వైపు ఉన్న స్వర్ణాల చెరువు కేంద్రంగా ఈ రొట్టెలను భక్తులు మార్పులు చేసుకుంటుంటారు. రాష్ట్ర నలుమూలల నుంచే కాక విదేశాల నుంచి కూడా భక్తులు ఈపండుగకు రావడం విశేషం. కరోనా వైరస్ విజృంభణ కారణంగా రెండు సంవత్సరాలుగా రొట్టెల పండుగ జరుపుకోలేదు. ఈసారి జరిగే రొట్టెల పండుగకు లక్షలాది ప్రజలు తరలివస్తారనే అంచనాతో అధికారులు, ప్రజాప్రతినిధులు అన్ని ఏర్పాట్లును చేసి సర్వం సిద్ధం చేశారు. నెల్లూరు గ్రామీణ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని అధికారులతో ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహించి పండుగ ఏర్పాట్లు చేయిస్తున్నారు. వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సైతం ఈరొట్టెల పండుగను విజయవతం చేసేందుకు ఉన్నతాధికారులతో సమీక్షలు నిర్వహించారు. ఆగస్టు 9వ తేది నుంచి 13వ తారిఖు వరకు అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య రొట్టెల పండుగ జరగనుంది. దర్గా ప్రాంతంలో నిరంతరం తాగునీటి సౌకర్యం ఏర్పాట్లుకు సన్నాహాలు జరుగుతున్నాయి. త్రాగునీరు లభించే ప్రదేశంలో సేచిక బోర్డులు ఏర్పాట్లు చేస్తున్నారు. లక్షలాది ప్రజలు హాజరవుతున్న దృష్ట్యా, రాత్రి వేళలో పగలు తలపించేలా లైటింగ్‌ను ఏర్పాటు చేశారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ రొట్టెల పండుగకు హాజరు కావాలని రూరల్ ఎమ్మెల్యే స్వయంగా ఫోన్‌చేసి ఆహ్వానిస్తున్నారు. ఆదివారం నాటికి దర్గా ప్రాంగణ మంతా వివిధ విద్యుత్ దీపాలతో చూడముచ్చటగా తీర్చిదిద్దారు, రొట్టెల పండుగ నిర్వాహక కమిటీ చైర్మన్ షాజహాన్, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి కనకదుర్గా భవాని, వక్ఫ్‌బోర్డు జిల్లా ఇన్స్పెక్టర్ షేక్. అహమ్మద్‌భాషా, ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

## జిల్లా స్థాయి చదరంగం విజేతలు వీరే



**బుచ్చి ఆగస్టు 7 ప్రభాతవార్త:** జిల్లా స్థాయి అండర్ 13 అండర్ 11 బాలబాలికలకు చదరంగం పోటీలలో గెలుపొందిన సందర్భంగా వారికి బహుమతి ప్రధానం చేసినట్లు నెల్లూరు చెస్ అసోసియేషన్ కార్యదర్శి పి మస్తాన్‌బాబు తెలిపారు.కోవూరులోని శ్రీచైతన్య టెక్నోస్కూల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయిలో గెలుపొందిన అండర్ 13 అండర్ 11 బాలబాలికలను భీమవరం,వైజాగ్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపడం జరుగుతుందని ఆయన తెలిపారు.అండర్13 ఓపన్ కేటగిరి అందలమాలహేమల్ వర్షన్,చెముడుగుంట ద్వారకనాద్, అండర్ 13 బాలికల విభాగం గొట్టేటి హిమతేజస్విని,అందలమలా జాన్వి తేజిని, అండర్ 11 ఓపన్ కేటగిరి అందలమాల హేమల్ వర్షన్,ఎంవిఎస్ యగ్నేశ్వర్‌రెడ్డి, అండర్ 11 బాలికల విభాగం అందలమాల జాన్వితేజిని,బట్టారం సంజన అని ఆయన తెలిపారు.ఈకార్యక్రమంలో ప్రిన్సిపల్ హనుమంతరావు, డీన్ పెంచలబాబు తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర ఉద్యమంలో మహనీయుల పాత్ర శ్లాఘనీయం



**బిట్రగుంట, ఆగస్టు 7 ప్రభాతవార్త:** మన దేశానికి స్వాతంత్ర్యాన్ని తీసుకురావడంలో ఎందరో మహనీయులు తమ ప్రాణాల్ని పణంగా పెట్టి పోరాడారని బోగోలు ఎంపిడివో నాసరరెడ్డి చెప్పారు. బోగోలు మండలం విశ్వనాధరావుపేట పంచాయతీలో ఆదివారం ఆజాదీకా అమృత మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా విశ్వనాధరావుపేట జిల్లా పరిషత్ నుండి ఇబ్రహీంపేట వరకు పాఠశాలల విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజాప్రతినిధుల ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎందరో త్యాగధనుల వల్ల దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని అటువంటి మహనీయుల్ని స్మరించుకొని వారి అడుగుజాడలలో నడవడం మన కర్తవ్యమన్నారు. ఈ ర్యాలీలో గ్రామ సర్పంచ్ గండూరు మంజుల, మండల విద్యాశాఖాధికారి జయంతిబాబు, జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రవీంద్రనాధ్‌ఠాగూర్, చెంచులక్ష్మి, సచివాలయ ఉద్యోగులు, వార్డు సభ్యులు, ఎన్‌సిసి క్యాడెట్లు పాల్గొన్నారు. మండలంలోని అన్ని గ్రామాలలో కూడా ఈ ర్యాలీలు నిర్వహించారు.

## వాతావరణ కాలుష్య నివారణ మొక్కలు పెంచాలి



**నెల్లూరుటౌన్,ఆగస్టు 06 ప్రభాతవార్త:** కాలుష్య నివారణకు,ప్రాణవాయువుకు మూలాధారమైన పచ్చని మొక్కలను ప్రతి ఒక్కరూ నాటాల్సిన అవసరం ఉందని మారిన్ ఆగ్రో ఇన్వెంటడ్ కంపెనీ అధినేత విజయ్‌కుమార్ పేర్కొన్నారు.నెల్లూరు నగరంలోని స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రస్తుత కాలుష్య వాతావరణంలో మానవాళిక స్వచ్ఛమైన ప్రాణవాయువు అందడంలేదన్నారు.స్వచ్ఛమైన ప్రాణవాయువు అందిచగలిగే ఏకైక ఆయుధం పచ్చని చెట్టున్నారు.రసాయానాలతో పండించిన కూరగాయాలు పండ్లు పప్పు దినుసులు ఆహార పదార్థాల వలన అనేక హానికరమైన అనారోగ్యాలు వచ్చే అవకాశం ఉందన్నారు.సేంద్రీయ ఉత్పత్తులను ఉత్పాదించేందుకు మారిన ఆగ్రో ఇన్వెంట్ కంపెనీ ఆద్వర్యంలో తయారు చేయబడిన కేంద్రియ ఎరువులను అందజేసేందుకు సిద్దంగా ఉన్నామన్నారు.సేంద్రియ ఎరువులు వాడకం వలన మొక్కలు త్వరగా పెరగడంతో పాటు ఎటువంటి తెగుళ్లకు అవకాశం ఇవ్వకుండా మంచి ఆరోగ్యవంతమైన మొక్కలుగా తయారయ్యేందుకు సేంద్రియ ఎరువులు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు.సేంద్రియ ఉత్పత్తుల కోసం 9989515588,9573909835నెంబర్లకు సంప్రదించాలన్నారు.

## వాకర్స్ అసోసియేషన్ త్రివర్ణ పతకాలు పంపిణీ



**బిట్రగుంట, ఆగస్టు 7 ప్రభాతవార్త:** బిట్రగుంట వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రైల్వే ఇన్స్‌టిట్యూట్ గ్రౌండ్‌లో త్రివర్ణ పతకాల్ని అసోసియేషన్ అధ్యక్షులు నూకసాని శ్రీనివాసులు పంపిణీ చేశారు. స్వాతంత్రం వచ్చి 75 పూర్తయిన సందర్భంగా వసంతాలు జరుగుతున్న నేపథ్యంలో ఆ మహనీయుల త్యాగాల్ని గుర్తు చేసుకుంటూ ప్రతి ఇంటి మీద జాతీయ జెండాని వుంచాలని నిర్ణయించుకున్నారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు బిట్రగుంట రైల్వే స్టేషన్ మేనేజర్ ఎస్.ఎస్.మీనా, డాక్టర్ ఆనందసాగర్, యన్.యస్.యన్.ఆచార్యులు, బత్తుల రవిచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

## వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కృషి



**నెల్లూరుటౌన్,ఆగస్టు 6 ప్రభాతవార్త:** వెనుకబడిన వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం ఆంధ్రప్రదేశ్ బ్యాక్వార్డ్ క్లాస్ ఫెడరేషన్ కృషి చేస్తుందని ఫెడరేషన్ చైర్మన్ తమ్మిశెట్టి చక్రవర్తి పేర్కొన్నారు.ఆదివారం నెల్లూరుకు విచ్చేసిన ఆయన ఏనుగు సుందరరామిరెడ్డి కళ్యాణమండలపం నందు ప్రముఖ మ్యూజిషియన్ గుంజి రంజీ కుమార్తె అభిజ్ఞ,కిషోర్ల వివహ మహోత్సవానికి విచ్చేసి నూతన దంపతులను ఆశీర్వదించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ బ్యాక్వార్డ్ క్లాస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వి.నరసయ్య పుట్టినరోజు సంధర్బంగా జిల్లా అధ్యక్షుడు గంధం అంకయ్య,కార్యకర్తలు ఏర్పాటు చేసిన కేక్ కటింగ్ కార్యక్రమంలో పాల్గొని పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం జిల్లా బిసి నాయకులు బండి ప్రసాద్ కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన తేనేటి విందుకు హాజరయ్యారు.ఈకార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు ఓర్సు ప్రేమరాజు,జిల్లా అధ్యక్షుడు అమరేష్,వడ్డెర నాయకులు బెల్లంకొండ శ్రీనివాస్,యూత్ కృష్ణా,వెంకటేశ్వరరావు,జోసెఫ్,భాను తదితరులు పాల్గొన్నారు.

## తనకు హక్కుగల స్థలాన్ని కాపాడండి



**నెల్లూరుటౌన్,ఆగస్టు 6 ప్రభాతవార్త:** నెల్లూరు నగరంలోని పోస్టల్ కాలనీ నందు 1970 నుంచి తమ తండ్రి అన్నామలై నుంచి సక్రమించిన తమ ఇంటి స్థలాన్ని కొంత మంది వ్యక్తులు దౌర్జన్యంగా ఆ క్రమిస్తున్నారని అన్నామలై రంగయ్య అనే వ్యక్తి ఆవేదన వ్యక్తం చేశాడు.తమ స్థలం పక్కనే ఉన్న కొంత మంది వ్యక్తులు దౌర్జన్యంగా తనకు చెందిన స్థలంలో ప్లెక్సీలు వేసి అక్రమంగా ఆక్రమించే ప్రయత్నం చేశారన్నారు. ప్రశ్నించినందుకు తనపై మారణాయుధాలతో దాడికి పాల్పడుతున్నారని తెలిపారు.జిల్లా ఎస్పీ,రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన తమకు న్యాయం జరగలేదన్నారు.జిల్లా అధికారులు స్పందించి న్యాయం చేయాలని రంగయ్య వేడుకున్నాడు.

## విద్యార్థులు దేశభక్తిని కలిగి వుండాలి




**కావలి రూరల్, ఆగస్టు 7 ప్రభాతవార్త:** విద్యార్థులు, ప్రజలు స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన స్వాతంత్ర సమరయోధుల గురించి తెలుసుకొని దేశభక్తి కలిగి వుండాలని గౌరవరం సర్పంచ్ దేవరపల్లి రాధిక తెలిపారు. కావలి రూరల్ మండలం గ్రామంలో ఆదివారం ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా విద్యార్థులు, గ్రామ ప్రజలు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లతో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో త్రివర్ణ పతకాలను చూపుతూ స్వాతంత్ర సమరయోధులకు జోహార్లు అంటూ నినాదాలు చేశారు. అనంతరం సర్పంచ్ రాధిక మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు దేశభక్తిని కూడా పెంపొందించుకోవాలన్నారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండాని ఎగురవేసి దేశభక్తిని ఘనంగా చాటి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సురే శ్రీలత, పంచాయతీ కార్యదర్శి రవిచంద్రకుమార్, సచివాలయ సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వార్డు సభ్యులు, వాలంటీర్లు, విద్యార్థులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## రక్తదానం ప్రాణదానంతో సమానం



**కోవూరు, ఆగస్టు 7 ప్రభాతవార్త :** రక్తదానం చేయడమనేది మరొకరికి ప్రాణదానంతో సమానమని ప్రముఖ డాక్టర్లు మన్నెం సతీష్, పన్నెం రమేష్‌బాబులు తెలిపారు. కోవూరులోని బుద్ధి పద్మావతి కళ్యాణ మండపంలో ఆదివారం చేనేత దినోత్సవ కార్యక్రమాన్ని పురస్కరించుకుని దేవాంగ సంక్షేమ సంఘు: ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తదానం చేస్తే శరీరం బలహీనపడిపోతుందనే అపోహ ఉందని అది సరికాదన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువకుడు రక్తదానం చేయవచ్చని ఈ సందర్భంగా వారు తెలియజేశారు. కోవూరు దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఇటువంటి కార్యక్రమం ఏర్పాటు చేయడం ఇతరులకు స్ఫూర్తిదాకమన్నారు. ఇదే స్ఫూర్తిని నిరంతరం కొనసాగించేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు పి. మధుసూదన్‌రావు మాట్లాడుతూ ఇప్పటికే తమ సంఘం ద్వారా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా నోవా బ్లడ్ బ్యాంకుకు 60 యూనిట్ల రక్తాన్ని దానం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి జి. మల్లికార్జున్‌రావు, ఉపాధ్యక్షుడు జి. నాగేశ్వరరావు,కోశాధికారి పి. రవి, పి. శ్రీనివాసులు, పి. మహేష్, జె. మహేష్, జె. మధు, పి. సుధాకర్, ఎం. ఉమ, పి. జనార్థన్, నవీన్, తదితరులు ఉన్నారు.

## కైలాస భూమి అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి



**కోవూరు, ఆగస్టు 7 ప్రభాతవార్త :** కోవూరు మండలం పడుగుపాడులోని కైలాస భూమి అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించినట్లు మాజీ ఎంపీటీసీ సభ్యులు, సీనియర్ నాయకులు కాటంరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. కోవూరు మండలం పడుగుపాడులోని కైలాస భూమిలో ఆదివారం డీఎల్‌డీఏ డైరెక్టర్ కాటంరెడ్డి దినేష్‌రెడ్డి, గ్రామ ఉపసర్పంచ్ అహ్మద్ ఆధ్వర్యంలో కైలాస భూమి అభివృద్ధిపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాటంరెడ్డి దినేష్‌రెడ్డి ప్రత్యేకంగా చొరవ తీసుకుని కైలాస భూమి అభివృద్ధికి లక్ష రూపాయల నిధులు వితరణగా అందజేయడం ఇతరులకు స్ఫూర్తిదాయకమన్నారు. అదేవిధంగా గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో కూడా ఈ కైలాస భూమి అభివృద్ధికి మరికొంత నిధులు అందజేసేలా చర్యలు తీసుకుంటామని సర్పంచ్ లక్ష్మీనారాయణ ఈ సందర్భంగా తెలియజేశారు. పడుగుపాడు గ్రామంలోని దాతల సహకారంతో ఈ కైలాస భూమిని మరింత అభివృద్ధి పరిచేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మానవుని చివరి మజిలి అయిన ఈ ప్రాంతాన్ని ప్రతి ఒక్కరూ ఆకట్టుకునే విధంగా తీర్చిదిద్దేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ ఆదిశేషయ్య, మాజీ శివాలయం చైర్మన్ ఆర్. జనార్ధన్‌రెడ్డి, గ్రామస్తులు ఉన్నారు.

## సంక్షోభంలో చేనేత రంగం



**కోవూరు, ఆగస్టు 7 ప్రభాతవార్త :** దేశంలో ఎంతో ఘన చరిత్ర కలిగిన చేనేత రంగం జీఎస్‌టీ, కరోనా కారణంగా పూర్తిగా సంక్షోభంలో కూరుకుపోయిందని జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లురెడ్డి అన్నారు. కోవూరులోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చేనేత దినోత్సవం సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ రంగాన్ని ఉదారంగా ఆదుకోవాలని పేర్కొన్నారు. ఎన్నికలకు ముందు చేనేత కార్మికులు అందరికీ నేతన నేస్తం ఇస్తానని చెప్పిన జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత కేవలం మగ్గం ఉన్న వారికి మాత్రమే ఇస్తున్నారన్నారు. కుంటి సాకులు చూపి ప్రతి సంవత్సరం లబ్దిదారుల సంఖ్యను తగ్గిస్తూనే ఉన్నారన్నారు. చేనేత కార్మికులు ఎప్పటి నుండో చేస్తున్న ఈ వృత్తిని గిట్టుబాటు లేని కారణంగా వదలలేక మరో పని చేయలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో చేనేత కార్మికులు అమలు చేస్తున్న అన్ని పథకాలను ఈ ప్రభుత్వం నిలిపివేసిందన్నారు. రాష్ట్రంలో మగ్గం ఉండే వారి కంటే అనుబంధ కార్మికులు అధిక సంఖ్యలో ఉన్నారన్నారు. కేవలం మగ్గం ఉండే వారికి మాత్రమే నేతన నేస్తం ఇస్తే మిగిలిన వారికి వ్వకపోవడం వలన ఈ వృత్తిలో అనుబంధ కార్మికులు నష్టపోతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చేనేత కార్మికులకు గతంలో అమలవుతున్న అనిన పథకాలను తిరిగి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జె. రవికుమార్, ఎస్ గోపాల్, యు. మల్లికార్జున, ఎస్. వెంకటేశ్వర్లు, సీహెచ్ శ్రీనివాసులు, బి. శివకుమార్, మురళీ కృష్ణారెడ్డి, వి. సురేష్, ఎస్‌డీ హుమయూన్ తదితరులు ఉన్నారు.

## భవన నిర్మాణ కార్మికుల సమావేశం



**బిట్రగుంట, ఆగస్టు 7 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన బోగోలులోని సిపియం కార్యాలయంలో ఆదివారం మండల భవన నిర్మాణ కార్మిక సంఘ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు ఎస్.కె.చాన్‌బాషా పాల్గొని కార్మికుల సమస్యలు గురించి చర్చించడం జరింది. ఈ సమావేశంలో సిపియం మండల కార్యదర్శి తుమ్మల వెంకయ్య, సిపియం నేతలు కె.చినవెంకయ్య, సిఐటియు మండల కార్యదర్శి చల్లా నరహరి, భవన నిర్మాణ కార్మిక సంఘ సభ్యులు ఎస్.కె.బాదుల్లా, వి.సూర్యం, ఎ.సురేష్, టి.రమణయ్య, డి.వి.రమణయ్య, సిగినం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ దీక్షలో ఆరోగ్యశ్రీ సాధన దినోత్సవం



వింజమూరు, ఆగస్ట్7,ప్రభాతవార్త: వింజమూరు తహసిల్దార్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పి ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిరసన దీక్షల్లో ఆదివారం 6వ రోజు ఆరోగ్యశ్రీ పథకం సాధన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు మల్లెల తిరుమలేశు మాదిగ ఆధ్వర్యంలో తహసిల్దార్ కార్యాలయం ఎదుట నిరసన దీక్షలు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పి జిల్లా నాయకులు పందిటి అంబేద్కర్‌మాదిగ మాట్లాడుతూ హైదరాబాదు కేంద్రంగా 2004లో కృష్ణమాదిగ సాధించిన పోరాట ఫలితమే ఆనాడు ఆరోగ్యశ్రీ పథకం వచ్చిందన్నారు. ఆరోగ్యశ్రీ పథకం అమలు గురించి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అసెంబ్లీ సాక్షిగా ఆరోగ్యశ్రీ పథకం గురించి , కృష్ణమాదిగ పోరాటం గురించి తెలిపారన్నారు . నేడు ప్రతి ఇంట్లో ఆరోగ్యశ్రీ కార్డు ఉందంటే దానికి కారణం ఎమ్మార్పీఎస్ అని , అదే విధంగా వికలాంగుల , వృద్ధుల, వితంతువుల పెన్షన్ పెంపుకొరకు చేసిన ఉద్యమ పోరాటాలు ప్రభుత్వం సానుకూలంగా స్పందించి ప్రవేశపెట్టిన ఘనత కృష్ణమాదిగకే దక్కుతుందన్నారు. రాబోయే రోజుల్లో మహాజన సోషలిస్ట్‌పార్టీకి ప్రజలందరూ అండగా నిలవాలని కోరారు. ఎస్సీ వర్గీకరణ సాధనే తమ అంతిమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఎంఎస్‌పి , ఎంఇఎఫ్ , ఎమ్మార్పీఎస్ నాయకులు చినరాములు, నందిపోగు వెంగళరావ్, దేవరపల్లి శ్రీనివాసులు, చెంచల రాకేష్, గంగపట్ల శివ, గంగపట్ల మదన్, జ్ఞానకుమార్, సాయి, జి.వెంగళరావ్, జి.నవీన్, జి.గౌతం పాల్గొన్నారు .

## రానున్న ఎన్నికలలో వైసిపి ప్రభుత్వాన్ని గద్దెదించాలి



**కావలి, ఆగస్టు 7 ప్రభాతవార్త:** రానున్న ఎన్నికలలో ప్రజలు ఆలోచించి ఓటు వేసి వైసిపి ప్రభుత్వాన్ని గద్దెదించాలని తెలుగుదేశం పార్టీ కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాలేపాటి సుబ్బానాయుడు పిలుపునిచ్చారు. కావలి మున్సిపాల్టీ పరిధిలోని మద్దూరుపాడు 1వ వార్డులో ఆదివారం 'జగనన్న బాదుడే...బాదుడు' కార్యక్రమాన్ని మాలేపాటి నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందజేసి వైసిపి అరాచక పాలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలుగుదేశ ప్రభుత్వ హయాంలో నిత్యావసర వస్తువుల ధరలు, గ్యాస్, డీజల్, పెట్రోలు ధరలు ఏ విధంగా వున్నాయో వైసిపి జగన్‌రెడ్డి పాలనలో ఈ ధరలు ఎలా వున్నాయో ప్రజలు ఆలోచించాలన్నారు. జగన్‌రెడ్డి పాలనలో పేదలు, మధ్యతరగతి ప్రజలు ఏ వస్తువు కొనలేక, తినలేక తల్లడిల్లిపోతున్నారన్నారు. కావలి నియోజకవర్గంలో అభివృద్ధి శూన్యమన్నారు. ప్రశ్నిస్తే దాడులు, తప్పుడు కేసులు పెడుతున్నారన్నారు. అంతా దోపిడీమయమైందన్నారు. అందుచేత ప్రజలు ఈసారి ఆలోచించి ఓటు వేయాలన్నారు. రానున్న ఎన్నికలలో తెలుగుదేశం పార్టీని గెలిపించి చంద్రబాబునాయుడుని ముఖ్యమంత్రిగా గద్దెనెక్కించాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు మన్నవ రవిచంద్ర, గుత్తికొండ కిషోర్‌బాబు, జ్యోతిబాబురావు, పోతుగంటి శ్రీకాంత్, కొమరా వెంకటేశ్వర్లు, పిలిమెట్ల సుబ్రమణ్యం, పులి శ్రీనివాసులు, ఆర్.రాఘవేంద్రరావు, సి.హెచ్.శ్రీనివాసులు, బాలమురళి, కొండలరావు, తిరుపతి, అక్కిలిగుంట సూర్య, కోవూరు వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఇంద్రాక్షి అమ్మవారికిఆలయానికి వినరల్ కూలింగ్‌వాటర్‌సిస్టం బహూకరణ



**మర్రిపాడు, ఆగస్ట్7,ప్రభాతవార్త:** చంఉచులూరు గ్రామంలోని ఇంద్రాక్షి అమ్మవారి దేవస్థానానికి కీ.శే.బాసిరెడ్డి జయరామిరెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారుడు బాసిరెడ్డి శివారెడ్డి ,కోడలు నాగజ్యోతి మినరల్ కూలింగ్‌వాటర్ సిస్టంను ఇంద్రాక్షి అమ్మవారి దేవస్థానానికి బహూకరించారు. ఈసిస్టమ్‌ను వారి మనుమడు వేదవి హాన్‌రెడ్డి ప్రారంభజంచారు. ఈసందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ కూలింగ్ వాటర్ సిస్టంను దేవస్థానం , హాస్పెటల్, పాఠవా లల పరిసరాల్లో అందరికీ అందు బాటులో ఉండేలా ఆలయం వద్ద ఏర్పాటు చేస్తున్నామని దీన్ని అందరూ వినియోగించు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బాసిరెడ్డి కృష్ణారెడ్డి, కోట విజయభాస్కర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, లక్ష్మిరెడ్డి, మల్లిఖార్జునరెడ్డి, శ్రీనివాసులురెడ్డిలు పాల్గొన్నారు.

## 7వ రోజుకు చేరిన ఎమ్మార్పీఎస్ నిరసన దీక్షలు

**కావలి, ఆగస్టు 7 ప్రభాతవార్త:** ఎస్సీ వర్గీకరణపై బిజెపి అనుసరిస్తున్న వైఖరిని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కావలి తహశీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన నిరసన దీక్షా శిబిరం ఆదివారం నాటికి 7వ రోజుకు చేరుకుంది. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పి నాయకులు అక్కిలిగుంట ఏసురత్నం మాదిగ, కిరణ్ మాదిగ, ప్రేమ్‌కుమార్ మాదిగ, ఎర్రయ్య, వై.శివ, జి.సురేంద్ర, సంతోష్, దయాకర్, కళ్యాణ్, మనోహర్, మహిళా నేతలు జానకి మాల, సుశీల, ఎంఇఎఫ్ నేతలు పాల్గొని మాట్లాడారు. ఖమ్మం జిల్లా వైరా మండలంలో మందా కృష్ణమాదిగ మీటింగ్ నిర్వహిస్తుంటే ఆ రోజు దూదేకుల కులానికి చెందిన నసీమా అనే అమ్మాయి గుండె సమస్యతో బాధపడుతూ కృష్ణమాదిగ దృష్టికి తీసుకొచ్చారన్నారు. డబ్బులు అయితే తన దగ్గర లేవని అమ్మాయి బ్రతికే మార్గం చూపిస్తానని ఆ అమ్మాయి తల్లికి కృష్ణమాదిగ హామీ ఇచ్చారన్నారు. ఆనాటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి దగ్గరకు ఈ బాలికను తీసుకెళ్లడం ఆయన పట్టించుకోకపోవడం జరిగిందన్నారు. దీంతో 2004 సంవత్సరం ఆగస్టు 7వ తేది ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని ఆయన స్థాపించారన్నారు. ఆ ఉద్యమం ఫలితమే ఆరోగ్యశ్రీ ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ఈ పార్లమెంటు సమావేశాలలో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించకపోతే బిజెపి తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరికలు చేశారు.

## చేవూరి ఇంట పంచకట్టు పంక్షన్ సందడి

**జలదంకి, ఆగస్టు7, ప్రభాతవార్త:** జలదంకి మండల వై.సి.పి కన్వీనర్ చేవూరి.జనార్ధన్ నివాసం ఆదివారం ఆదికారులు,బందు,మిత్ర సపరివారంతో కళకళ లాడింది.జనార్దనరెడ్డి మనుమడుమనుమరాలి పం చకట్టు, ఒనీల పంక్షన్ వేడుకలు ఆయన స్వగ్రామమైన సోమవరప్పాడులో ఘనంగా జరిగాయి. ఈవేడుకలకు మండ ల ప్రముఖులు తరలివచ్చి చిన్నారులను అక్షింతలు వేసిదీవించారు. సాంప్రదాయ బద్ధంగా సాగిన వేడుక పల్లె ప్రజలను కనువిందు చేసింది.ఔరా అంటూఅందరూ ముక్కున వేలేసుకున్నారు. దోతి కట్టు,ఒనీలు ధరించి పిల్లలు ముచ్చట గొలిపారు.

అనందరం విచ్చేసిన వారికి విందు ఏర్పాట్లు వంటివి ఎంతో హూందాగా అనిపించింది.అనంతరం గిఫ్టులు బహూకరించారు.ఈకార్యక్రమంలో తహసిల్‌దార్ శీతా మహాలక్ష్మి, ఎం.పి.డి.ఒఆదినారాయణ,ఎం.ఇ.ఒశ్రీధర్,ఎస్.ఐవీరాంజనేయులు,ఎ.ఎస్.ఐహరిబాబు,వ్యవసాయశాఖ వింజమూరు ఎ.డి.ఇ రామిరెడ్డి లతో పాటు ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు మండల ఉపాధ్యక్షుడు పాలవల్లి.మాలకొండారెడ్డి,వై.సి.పి నేతలు గుర్రం.జగ్గయ్య,మహిళానేత తిప్పారెడ్డి. ఇందిర, ఇస్కా. మదన్‌మోహన్‌రెడ్డి,ఎస్.వి శేషారెడ్డి సర్పంచ్‌లు మస్తాన్‌రెడ్డి,బి.వి కృష్ణారెడ్డి ,గోవర్ధనరెడ్డి, లక్ష్మినరసారెడ్డి, వల్లరెడ్డి.నరసారెడ్డి, పద్మనాభరెడ్డి, గద్దే. బ్రహ్మయ్య,పులిమి.బాబుల్‌రెడ్డి,తదితర నేతలు పాల్గొన్నారు.